క్లుప్తంగా

చెరువులను పరిశీలించిన డీఈ



గంభీర్‌పూర్ చెరువును పరిశీలిస్తున్న అధికారులు

కథలాపూర్: మండలంలోని గంభీర్‌పూర్, పోసానిపేట, దుంపేట గ్రామాల్లోని చెరువులను నీటిపారుదలశాఖ డీఈ ప్రశాంత్ బుధవారం పరిశీలించారు. ఈ చెరువుల మరమ్మతులకు ప్రభుత్వం గత నెలలో నిధులు మంజూరు చేసిన విషయం తెలిసిందే. నిధులతో ఏఏ పనులు చేపట్టాలనే విషయాలను కాంట్రాక్టర్‌కు వివరించారు. వీలైనంత త్వరగా చెరువులను మరమ్మతులు చేయాలని అధికారులు సూచించారు. ఆయన వెంట ఏఈ శ్రీనివాస్, నాయకులు కాయితి నాగరాజు, కల్లెడ గంగాధర్, ధనుంజయ్‌రెడ్డి ఉన్నారు.

కాయితి శ్రీనివాస్‌కు అంబేడ్కర్ జాతీయ అవార్డు



అవార్డు ప్రతిని చూపుతున్న శ్రీనివాస్

జగిత్యాలటౌన్: పట్టణానికి చెందిన కాయితి శ్రీనివాస్ డా. బీఆర్ అంబేడ్కర్ జాతీయ అవార్డుకు ఎంపికై నట్లు బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ బుధవారం తెలిపారు. సమాజంలోని మూఢనమ్మకాలు, అజ్ఞానం, అంటరానితనం, పేదలకు విద్యా, వైద్యం, రాజ్యాంగ విలువలు తదితర అంశాల్లో ప్రజలను చైతన్య పరుస్తున్న జగిత్యాలకు చెందిన శ్రీనివాస్‌కు జూన్ 10న మహారాష్ట్రలోని పూణేలో ఈ అవార్డు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. అవార్డుకు ఎంపికైన శ్రీనివాస్‌ను బహుజన నాయకులు బండ శంకర్, బొల్లం విజయ్‌కుమార్, మద్దెల నారాయణ తదితరులు అభినందించారు.

సీసీకెమెరాల ఏర్పాటుకు దంతవైద్యుల విరాళం



చెక్కు అందిస్తున్న దంత వైద్యులు

జగిత్యాలక్రైం: జగిత్యాల పట్టణంలో సీసీకెమెరాల ఏర్పాటుకు పట్టణ దంత వైద్యులు బుధవారం పట్టణ సీఐ వేణుగోపాల్‌కు రూ.40 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో దంత వైద్యుల సంఘం కార్య నిర్వాహకులు డాక్టర్ ప్రవీణ్ చంద్ర, డాక్టర్ లక్ష్మీనారాయణ, కోశాధికారి డాక్టర్ కల్యాణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వర్తక సంఘం పట్టణ అధ్యక్షుడిగా సత్యనారాయణ



ఎన్నికైన నూతన కార్యవర్గం

రాయికల్: రాయికల్ పట్టణ వర్తక సంఘం అధ్యక్షుడిగా ఎలగందుల సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా అనంతుల సంపత్, ముక్క రంజిత్, ప్రధాన కార్యదర్శిగా నరంశెట్టి మహేశ్, సంయుక్త కార్యదర్శిగా చౌదారపు లక్ష్మీనారాయణ, కోశాధికారిగా సిద్ధంశెట్టి శ్రీనివాస్ బుధవారం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ వర్తక సంగం అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

అంబేడ్కర్ సంఘం నూతన కార్యవర్గం..



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

కొండగట్టు: కొడిమ్యాల మండలం నల్లగొండలో అంబేడ్కర్ సంఘం నూతన కార్యవర్గంను బుధవారం ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా గజ్జెల నవీన్,ఉపాధ్యక్షుడిగా సామల్ల గంగయ్య, కోశాధికారిగా కొత్తూరి లింగయ్య, ప్రధాన కార్యదర్శిగా కే.ప్రశాంత్, సలహాదారుగా కన్నం వెంకటి,మెట్ల మల్లేశంను ఎన్నుకున్నారు.

ఉపాధి పనుల్లో మహిళలే అధికం

- గ్రామాల్లో జోరుగా ఉపాధి హామీ పనులు
- కూలీ పెంచిన ప్రభుత్వం
- సద్వినియోగం చేసుకుంటున్న కూలీలు



పెగడపల్లి మండలం బతికపల్లిలో ఉపాధిహామీ పనులు చేస్తున్న మహిళా కూలీలు

పెగడపల్లి:మండలంలో చేపడుతున్న ఉపాధిహామీ పనుల్లో మహిళా కూలీలు అధికంగా పాల్గొంటున్నారు. పురుషులు వ్యవసాయం, ఇతరత్రా పనులు చేస్తుండగా మహిళలకు ఉపాధిహామీ పనులు వరంగా మారాయి. వేసవిలో వ్యవసాయ పనులు అంతగా లేక పోవడంతో మహిళా కూలీలు అధిక సంఖ్యలో ఉపాధిహామీ పనులకు వెళ్తున్నారు. మండుతున్న ఎండలను సైతం లెక్క చేయకుండా రెండు నెలలుగా కుంటల సేద్యం, చెరువుల్లో పూడిక తీత, పంట కాలువల శుభ్రం, కాంటూరు కందకాల తవ్వకాల పనులు, నర్సరీల పెంపకం పనుల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. స్త్రీ, పురుషులనే బేధం లేకుండా పని దినాలు కల్పిస్తుండటంతో పురుషుల కంటే మహిళలే అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు. ఉదయం 7 గంటల వరకే ఇంటి వద్ద పనులు ముగించుకుని ఉపాధిహామీ పనులకు తరలి వెళ్తున్నారు. మండలంలో 10064 జాబ్ కార్డులుండగా సుమారు 10,245 మంది కూలీలున్నారు. ఇందులో 7583 మంది మహిళలు ఉన్నారు. గతేడాది మొత్తం 8200 మంది కూలీలు పనుల్లో పాల్గొనగా వారిలో 6571 మంది మహిళా కూలీలు ఉన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు మండలంలోని 23 గ్రామాల్లో నిర్వహిస్తున్న పనుల్లో 6583 మంది కూలీలు పాల్గొనగా వారిలో 4 వేలు మంది మహిళలు ఉన్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

కుటుంబ పోషణకు ఉపయోగం



ఇటీవల ప్రభుత్వం ఈజీఎస్ కూలీ రూ. 300కు పెంచింది. ఉపాధి పనులపై సంపాదించే మొత్తంలో కుటుంబ అవసరాలకు ఉపయోగపడుతోంది. కొంత మొత్తం పొదుపు చేస్తున్నాను. ఉదయమే పనికి వెళ్లి ఎండకాకముందే ఇంటికి వస్తున్నాం. – ఓరెం సత్తమ్మ పెగడపల్లి

కలిసి పనిచేస్తుంటే అలసట ఉండదు



మహిళలందరూ కలిసి పనిచేస్తుంటే అలసట కనిపించదు. ఒకే పనిని వందలాది మహిళలు చేపట్టడంతో పనులు త్వరగా పూర్తవుతున్నాయి. మండుతున్న ఎండలతో కొంత కష్టంగా ఉన్నా కూలీ పెంచడంతో ఆనందంగా పనిచేస్తున్నాం. – నిమ్మ ఎల్లమ్మ బతికపల్లి

సద్వినియోగం చేసుకుంటున్నారు



ఉపాధిహామీ పనుల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు. మండలంలోని 23 గ్రామాల్లో పనులు వేగంగా పనులు జరుగుతున్నాయి. పనుల్లో మహిళలే అధికంగా హాజరవుతున్నారు. వారు చేపట్టిన పనులను లక్ష్యం మేరకు పూర్తి చేస్తున్నారు. – శ్రీనివాస్‌రెడ్డి ఎంపీడీవో

ఓటింగ్ సరళిపై జీవన్‌రెడ్డి సమీక్ష



కార్యకర్తలు, నాయకులతో జీవన్‌రెడ్డి

సారంగాపూర్: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి బుధవారం సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల నాయకులు, కార్యకర్తలతో విస్తృతంగా సమీక్షించారు. గ్రామాల వారీగా పోలింగ్ ఎంత శాతం నమోదైయింది, అందులో కాంగ్రెస్ పార్టీకి పోలయ్యే ఓట్లు ఎంత శాతం ఉంటుందన్న విషయంపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీపీలు మసర్తి రమేశ్, కోల జమున, వైస్‌ఎంపీపీ బల్మూరి లక్ష్మణ్‌రావు, విండో చైర్మన్లు పొల్సాని నవీన్‌రావు, గుర్నాథం మల్లారెడ్డి, ఏలేటి నర్సింహ్మారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు రాంచంద్రారెడ్డి, జితేందర్, సుభాశ్, నాయకులు ఉన్నారు.

జీవన్‌రెడ్డిని కలిసిన నాయకులు

రాయికల్: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని రాయికల్ మండల కాంగ్రెస్ నాయకులు బుధవారం కలిశారు. రాయికల్ పట్టనంతో పాటు, మండలంలోని 32 గ్రామాల్లో ఎన్నికల పోలింగ్ సరళిపై బూత్‌ల వారిగా వివరించారు. కార్యక్రమంలో హనుమాన్ ఆలయ కమిటీ చైర్మన్ గంగాధర్, పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేశ్, పార్టీ నాయకులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

పాడిరైతు కుటుంబానికి పరామర్శ

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి గ్రామానికి చెందిన పాడి రైతు బేతి రాంమోహన్‌రెడ్డికి చెందిన పశుగ్రాసం, రేకులషెడ్డు మంగళవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని దగ్ధం కాగా, బుదవారం మోరపల్లి గ్రామానికి వెళ్లి బాధిత రైతును జీవన్‌రెడ్డి పరామర్శించారు.

అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

జగిత్యాల: జగిత్యాలలోని ముక్రంపుర కాలనీలో సెట్‌బ్యాక్ లేకుండా నిర్మిస్తున్న మల్టీ ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలని అవార్డు జమా మసీదు కమిటీ నాయకులు కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆస్పత్రికి పార్కింగ్ సదుపాయం లేదని, జనరేటర్ సైతం రోడ్డుపై పెడుతున్నారన్నారు. దీంతో ప్రజలకు ఇబ్బందులు కలగుతున్నాయన్నారు. అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఓటమి భయంతోనే బీఆర్ఎస్‌పై ఆరోపణలు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి

మల్లాపూర్: ఓటమి భయంతోనే కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌పై ఇష్టారీతిన ఆరోపణలు చేస్తున్నారని జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మల్లాపూర్‌లో బుధవారం నిర్వహించిన బీఆర్ఎస్ నాయకుల సమావేశంలో మాట్లాడారు. గత ఎన్నికల్లో కవితను ఓడగొట్టేందుకు బీజేపీతో కాంగ్రెస్ కుమ్మక్కు అయింది నిజం కాదా.. అని ప్రశ్నించారు. మీడియా సాక్షిగా జీవన్‌రెడ్డి, అర్వింద్ అలయ్..బలాయ్ తీసుకున్న సంగతిని ప్రజలందరూ చూశారన్నారు. ఇటీవల ఎన్నికల ప్రచారంలో డీ.శ్రీనివాస్ కొడుకని అర్వింద్‌కి మద్దతిచ్చి గెలిపించామన్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వ్యాఖ్యలు దేనికి సంకేతమని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పట్ల ప్రజల్లో పెరుగుతున్న సానుకూలతను ఓర్వలేక మద్యం, డబ్బు పంపిణీతో గెలిచేందుకు కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ ముద్దం శరత్ గౌడ్, నాయకులు కోమ్ముల జీవన్‌రెడ్డి, డబ్బ రమేష్‌రెడ్డి, ద్యాగ గంగారెడ్డి, క్యాతం ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



పట్టుకున్న రేషన్ బియ్యంతో అధికారి

వెల్గటూర్: మండలంలోని రాజక్కపల్లిలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పట్టుకున్నట్లు సివిల్‌సప్‌లై డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. గ్రామానికి చెందిన మాజీ వార్డ్ మెంబర్ ఇంట్లో అక్రమంగా పీడీఎస్ బియ్యం నిల్వ ఉంచారన్న పక్కా సమాచారం మేరకు బుధవారం సివిల్ సప్‌లై అధికారులు ఇంటిపై దాడులు చేశారు. 10 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నారు. అక్రమ బియ్యం నిల్వ చేసిన గదిని వెంకటేశ్ అనే వ్యక్తికి అద్దెకు ఇచ్చినట్లు ఇంటి యజమాని వెల్లడించగా, వెంకటేశ్‌పై కేసు నమోదు చేసి బియ్యం సీజ్ చేసినట్లు సివిల్ సప్‌లై అధికారులు తెలిపారు.

సమాజ సేవలో ప్రతీ ఒక్కరు పాల్గొనాలి

జగిత్యాల: సమాజ సేవలో ప్రతీ ఒక్కరు పాల్గొనాలని మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ అన్నారు. సోమవారం జరిగిన ఎన్నికల్లో స్వచ్ఛంద సేవ చేసిన 200 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల్లో దివ్యాంగులు, వృద్ధులను పోలింగ్ బూత్‌లు ఎక్కడున్నాయో తెలియని వారికి సాయం చేయడం అభినందనీయమని, ముందు కూడా సామాజిక సేవల్లో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి, జమున, కిరణ్మయి పాల్గొన్నారు.

ఆర్డీవోపై చర్యలు తీసుకోండి

జగిత్యాల: ఉపాధ్యాయులపై లాఠీచార్జీ చేయించిన నారాయణఖేడ్ ఆర్డీవోపై చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్యామ్‌సుందర్, అంబటి భూమేశ్వర్ డిమాండ్ చేశారు. ఈ నిబంధనల ప్రకారం టీఏ, డీఏ చెల్లించాలని డిమాండ్ చేసిన ఉపాధ్యాయులపై పోలీసులు బలప్రయోగం చేయడం సమంజసం కాదన్నారు. వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పశుగ్రాసం దగ్ధం

సారంగాపూర్: మండల కేంద్రంలోని మోతుకుల కుంట్ల శివారులో కోసిన పొలాల్లోని వరి కొయ్యలకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుని రైతులకు నష్టం జరిగింది. వివరాలు ఈ విధంగా ఉన్నాయి. కోసిన వరికొయ్యలకు నిప్పంటుకోవడంతో పశుగ్రాసం(వరి) కట్టలు, పలువురు రైతులకు చెందిన విద్యుత్ మోటర్లు, పైపులు కాలిపోయి రైతులకు తీవ్ర నష్టం జరిగింది. అధికారులు వరి కొయ్యలకు నిప్పుపెడితే భూసారం దెబ్బతింటుందని చెబుతున్నా, రైతులు మాత్రం పట్టించుకోకపోవడంతో ఇటువంటి నష్టాలు తరచూ చోటుచేసుకుంటున్నాయని పలువురు రైతులు అంటున్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి సబ్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మెట్‌పల్లి ఏడీఈ దురిశెట్టి మనోహర్ తెలిపారు. విద్యుత్ ఫీడర్ల నిర్వహణలో భాగంగా ఈ నెల 17 నుంచి ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. 33 కేవీ లైన్ల కింద మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు.17 న వెల్లుల, జగ్గాసాగర్, 18 న కోనరావుపేట,వేంపేట,చౌలమద్ది,మెట్‌పల్లి టౌన్, 19 న ఆత్మకూర్,20న మేడిపల్లి(ప),వెంకట్రావుపేట, బండలింగాపూర్, మెట్లచిట్టాపూర్, అమ్మక్కపేట, డబ్బా వాటర్‌గ్రిడ్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

మెట్‌పల్లి: పట్టణంలోని రాంనగర్, కళానగర్, సుల్తాన్‌పురా, ఆదర్శనగర్, కొత్త బస్టాండ్, కేడీసీసీ బ్యాంకు, సంఘం ఆస్పత్రి, హృద్య ఆస్పత్రి ప్రాంతాల్లో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రవి తెలిపారు.

కోరుట్లరూరల్: మండలంలోని పైడిమడుగు, మాదాపూర్ సబ్‌స్టేషన్ల పరిధిలోని మాదాపూర్, కల్లూర్, సర్పరాజ్‌పూర్, జోగిన్‌పల్లి, పైడిమడుగు గ్రామాల్లో గురువారం ఉదయం 8 గంటల నుంచి మద్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో రూరల్ ఏఈ భుక్యా శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్లలో వార్షిక మరమ్మతులు నిర్వహిస్తున్నట్లు ఏఈ పేర్కొన్నారు.

వెల్గటూర్: మండల పరిధిలోని 33/11 కేవీ ముత్తునూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ తెలిపారు. విద్యుత్ లైన్ల కింద పెరిగిన చెట్ల కొమ్మలు తొలిగించడానికి వంగిన పోల్స్, వేలాడే లైన్లను సరిచేయడం, తెగిన వైర్లను సరిచేయడానికి వినియోగదారులు సహకరించాలని ఏఈ పేర్కొన్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

మల్లాపూర్: గ్రామీణ ప్రాంతం నుంచి ఎస్సెస్సీ టాపర్‌గా మామిడాల లిఖిత(9.8 జీపీఏ) నిలవడం అభినందనీయమని కేరళ హైస్కూల్ ప్రిన్సిపాల్ సీబీ.అనిల్‌సింగ్ అన్నారు. మండలంలోని కొత్తదాంరాజుపల్లిలో కేరళ హైస్కూల్‌లో ఎస్సెస్సీ టాపర్లుగా నిలిచిన విద్యార్థులను బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెకండరీ బోర్డు విడుదల చేసిన ఫలితాల్లో మామిడాల లిఖిత(9.8 జీపీఏ), సామ శరణ్య(9.8 జీపీఏ), చల్ల వైశాలి(9.5 జీపీఏ)లు టాపర్లుగా నిలిచారని పేర్కొన్నారు. ఈ విద్యార్థులందరూ భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

కాల్వ గండి పూడ్చేదెప్పుడో?



గండి పడిన రాళ్లవాగు ప్రాజెక్టు కుడికాలువ

మండలంలోని పలు గ్రామాలకు ప్రధానమైన నీటి వనరు రాళ్లవాగు ప్రాజెక్టు కుడి కాలువకు గండి పడి నెలలు గడిచినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. కాలువ గండికి త్వరగా మరమ్మతు చేయిస్తే ఈ వర్షాకాలం పంటలకు నీళ్లందుతాయని ఆయకట్టు రైతులు అభిప్రాయపడుతున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా కథలాపూర్ మండలంలోని భూషణరావుపేట, కథలాపూర్, ఊటొపెల్లి, మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ గ్రామాలకు సాగునీరందుతుంది. ప్రభుత్వం, నీటిపారుదలశాఖ అధికారులు చొరవ చూపి కాలువకు పడిన గండిని త్వరగా మరమ్మతు చేయించేందుకు నిధులు మంజూరు చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. – కథలాపూర్

బీరప్ప జాతర ఉత్సవాల్లో ప్రభుత్వ విప్



బీరప్ప ఆలయంలో పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్: మండలంలోని గంభీర్‌పూర్‌లో బీరప్ప జాతర ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పూజారులు పట్నం ముగ్గు వేయగా, భక్తులు పూజలు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు, నాయకులు పులి హరిప్రసాద్, తొట్ల అంజయ్య, పబ్బ శ్రీనివాస్, జవ్వాజి చౌదరి, రవి ఆకుల సంతోష్, పాల్గొన్నారు.

నరసింహస్వామి కల్యాణ మహోత్సవంలో..

మేడిపల్లి: మండలంలోని మాచాపూర్‌లో శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణ మహోత్సవంలో వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆదిశ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఏనుగు రమేశ్ రెడ్డి, సింగిరెడ్డి నరేశ్ రెడ్డి, చేపూరి నాగరాజు, మాదం వినోద్, సాయిని గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మల్లాపూర్ జెడ్పీ హైస్కూల్ 2005-06 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

మల్లాపూర్: 18 ఏళ్ల క్రితం పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు కలిసి అపూర్వ సమ్మేళనం నిర్వహించుకున్నారు. మల్లాపూర్ జెడ్పీ పాఠశాలలో 2005-06లో 10వ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులందరూ కలిసి బుధవారం అపూర్వ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఆనాటి మధురమైన జ్ఞాపకాలను తలుచుకుంటూ ఆటపాటలతో నృత్యాలు చేస్తూ ఆనందోత్సాహాలతో మునిగిపోయారు.తమను విద్యావంతులుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను ఎప్పటికీ మరిచిపోమని, వారికి జీవితాంతం రుణపడి ఉంటామని తెలిపారు.

కథలాపూర్‌లో..

కథలాపూర్: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో 2008–09 విద్యాసంవత్సరం పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థుల సమావేశం బుధవారం జరిగింది. అప్పట్లో పాఠాలు చెప్పిన గురువులను సమావేశానికి ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. అనంతరం ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని సంబరాల్లో మునిగిపోయారు. ఆడుతూ పాడుతూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సవాల మధ్య గడిపారు. సాయంత్రం సామూహికంగా భోజనాలు చేసి ఆటపాటలతో సందడి చేశారు.



కథలాపూర్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు, అప్పటి గురువులు